క్లుప్తంగా

మాఘ మాసోత్సవాలు ప్రారంభం



స్వామికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు

అల్లిపురం : వేంకటేశ్వర మెట్టపై వెలసిన సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘ మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి ఆదివారం సందర్భంగా దేవాలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్ర నామాలతో సహస్ర నామాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కేశవాచార్యులు మాట్లాడుతూ 16వ తేదీన రథ సప్తమి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని తెలిపారు.

వైభవంగా రాజశ్యామల అమ్మవారి నవరాత్రులు



విశేష అలంకరణలో రాజశ్యామల అమ్మవారు

అల్లిపురం : వివేకానంద కాలనీలో వెలసిన రాజశ్యామల అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం వాగ్వాదిని శ్యామలా దేవిని ఆవాహన చేసి, అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సహస్ర నామార్చన, శ్రీ చక్ర కుంకుమార్చన చేపట్టారు. 16 మంది ముత్తయిదువులకు షోడశ విద్యలు, షోడస లక్ష్మలతో శాస్త్రోక్తంగా సుహాసినీ పూజలు చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నకుల శ్యామల హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయానికి చేరుకున్న ఎరుకుమాంబ ఉత్సవ విగ్రహం



దొండపర్తిలో ఊరేగిస్తున్న ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం అల్లిపురం నుంచి భారీ ఊరేగింపుగా గ్రామంలోకి తోడ్కొని వచ్చారు. దాత ధన సహాయంతో పాటు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ధన సహాయంతో ఉత్సవ విగ్రహాన్ని గుర్రబ్బండిపై డప్పులు, గరిడి, కోలాటంతో ఊరేగించి, ఆలయంలో అధిష్ఠింపజేశారు. ఈ నెల 17వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ చేస్తారని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నీలాపు సర్వేశ్వర రెడ్డి తెలిపారు. ప్రతిష్ఠ రోజు గ్రామ ప్రజలు, ధర్మకర్తలు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని నిరసన

సీతమ్మధార : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని పీడీఎస్‌వో నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ ఐదవ లైన్ ప్రధాన రహదారిలో జరిగిన ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎస్.రుద్రి, విశ్వనాథం, రాము తదితరులు పాల్గొన్నారు.

‘చేయూత’తో..ఆర్థిక భరోసా

అన్ని వర్గాలను ఆదుకుంటున్న నాయకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు కొనియాడు తున్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తున్న ఆయనే మళ్లీ మా ముఖ్యమంత్రి అని మహిళలంతా ముక్తకంఠంతో నినదిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి పథకాలు అందని తమకు ఇప్పుడు సంక్షేమ పథకాలు అందుతూ చక్కగా కుటుంబాలను పోషించుకుంటున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నియోజకవర్గంలో 11,295 మందికి జగనన్న ‘చేయూత’
- సీఎం జగన్ అందజేస్తున్న ఆర్థిక సాయంతో వ్యాపారులుగా రాణిస్తున్న మహిళలు
- ఇలాంటి ముఖ్యమంత్రే తమకు కావాలంటున్న అతివలు

నియోజకవర్గంలో నాలుగేళ్లుగా చేయూత అందుకున్న లబ్ధిదారులు, జమ అయిన నగదు

వార్డు	లబ్ధిదారులు	నగదు (రూ.)
28	1042	38135782
29	788	33712500
30	1050	41925000
31	736	28537500
32	511	22143750
33	753	28639865
34	1201	53850000
35	1134	43912500
36	989	43481250
37	939	40518750
38	912	39900000
39	1240	54375000



జగనన్న చేయూతతో ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటున్న వరలక్ష్మి

జగదాంబ : నాలుగేళ్లుగా నియోజకవర్గంలోని 12 వార్డుల్లో 11,295 మంది లబ్ధిదారులకు రూ. 4,61,31,897 నగదును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. చిరు వ్యాపారులకు జగనన్న చేయూత జీవనోపాధి అందిస్తోంది. 45 నుంచి 60 సంవత్సరాలలోపు వారందరికీ ప్రభుత్వం ఈ పథకం అందజేస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంకా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ముఖ్యంగా మహిళలు సాధికారత సాధించాలని నవరత్నాలు విడుదల చేశారు. ఈ పథకాలు ఆర్థికంగా ఎదగడానికి చిరు వ్యాపారాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఒక్క జీవీఎంసీ 35వ వార్డులోనే 2,600 మందికి పైగా జగనన్న చేయూత అందిస్తున్నారు.

ఆర్థిక భరోసా కల్పించారు..

ముఖ్యమంత్రి జగన్ చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన చేయూత పథకం ద్వారా ఒక్కొక్క లబ్ధిదారుకు రూ.18,500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. వీరందరూ చేయూత నగదు అందుకుంటూ పూర్ణామార్కెట్‌లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. గతంలో ఓటు అడగడానికి తప్ప ఒక్కరూ తమను ఆదుకోలేదని.. జగనన్న మాత్రమే తమకు అండగా నిలబడ్డారని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చేయూత సాయంతో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న రామలక్ష్మి



మళ్లీ జగనన్నే సీఎం కావాలి..



మాకు ఒక్క పథకం కూడా రాని రోజుల్లో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది ఇప్పుడు జగనన్న ఇంట్లో ఉన్న వారందరికీ ఏదో ఒక పథకం అందజేస్తూ మూడు పూటలా తినే యోగం కల్పించారు. ఇటువంటి ముఖ్యమంత్రే మాకు కావాలి. మళ్లీ జగనన్ననే గెలుపించుకుంటాం. అప్పుడే మాకు న్యాయం జరుగుతుంది.

– వరలక్ష్మి, ఫ్యాన్సీ వ్యాపారి, పూర్ణామార్కెట్

నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాం..



జగనన్న చేయూతతో మేమూ నాలుగు రాళ్లు సంపాదించుకుంటున్నాం. గతంలో ఇంటికే పరిమితం అయిన మేము కుటుంబాలను నెట్టుకు రావడానికి నానా కష్టాలు పడేవాళ్లం. ఏ ఒక్క నాయకుడు గానీ, పార్టీ గానీ మా కష్టాలు తీర్చలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా నిలబడి ఆయన మాకు అండా దండా అందిస్తున్నారు. ఆయనకు ధన్యవాదాలు.

– రామలక్ష్మి, కూరగాయల వ్యాపారి, రామకృష్ణాబజార్

అర్హులందరికీ పథకాలు అందజేస్తాం..



ప్రభుత్వం ఇస్తున్న ప్రతి పథకం అర్హులందరికీ అందిస్తున్నాం. ఇప్పటికీ అర్హులై ఉండి కూడా ఎవరికైనా ఏదైనా పథకం అందకపోతే వెంటనే తెలియజేయాలి. అలా చేస్తే వారింటికి సెక్రటరీ వెళ్లి వారి అర్హతలు తెలుసుకుంటారు. దాని ప్రకారం వారికి కూడా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం.

– బి.సన్యాసినాయుడు, జోన్–4 కమిషనర్, సూర్యాబాగ్

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంకరరావు

అల్లిపురం : నేర ప్రవృత్తి వదిలి సత్ప్రవర్తనతో మెలగాలని టూటౌన్ ఎస్‌ఐ శంకరరావు రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశాల మేరకు టూటౌన్ పరిధిలో గల రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలిగిన వారి రికార్డులు పరిశీలించి వారిపై గల రౌడీ, సస్పెక్ట్ షీట్లు తొలగిస్తామన్నారు. నిరంతరం వారిపై నిఘా ఉంటుందన్నారు. పోలీసుల ఆంక్షలను కాదని నేరాలకు పాల్పడిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సూర్య దేవునికి విశేషంగా పూజలు



సూర్యనారాయణ స్వామి

సింహాచలం : మాఘ మాసంలో తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాల సమీపంలోని సప్త అశ్వ వాహన సమేత సూర్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్య హృదయ పారాయణ చేశారు.

15న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మహారాణిపేట : రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉపకరణాలు అందించేందుకు దివ్యాంగులను ఎంపిక చేశారు. జిల్లా అధికార యంత్రాంగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలీమ్ కో సహకారంతో నిర్వహించిన గుర్తింపు శిబిరంలో అప్పుడు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇప్పుడు ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. ఈనెల 15వ తేదీన డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో జీవీఎల్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రూ. 2 కోట్ల 50 లక్షల విలువ గల బ్యాటరీతో కూడిన 282 మూడు చక్రాల సైకిళ్లు, 169 ట్రై సైకిళ్లు, 213 వీల్ చైర్లు, 869 వినికిడి యంత్రాలు, 1600 చేతి కర్రలు (బ్లైండ్ స్టిక్స్) లబ్ధిదారుల కోసం సిద్ధం చేశామని కార్యక్రమ కోఆర్డినేటర్ రూపాకుల రవికుమార్ తెలిపారు.



పంపిణీకి సిద్ధమైన దివ్యాంగుల ఉపకరణాలు

పన్నెండేళ్ల తర్వాత కలిసిన నర్సులు

మహారాణిపేట : పన్నెండు సంవత్సరాల తర్వాత నర్సులు ఒక చోట కలిశారు. 1986 బ్యాచ్‌కి చెందిన వారంతా ఆదివారం ముడసర్లోవ పార్కులో ఒకచోట చేరి ఉల్లాసంగా గడిపారు. అప్పట్లో కేజీహెచ్ నర్సింగ్ కాలేజీలో వీరు చదువుకున్నారు. ఇందులో నలుగురు కరోనాతో చనిపోయారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని నర్సులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ బ్యాచ్ 2012లో ఒకసారి కలిశారు. మళ్లీ 12 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ ఇప్పుడు కలిసి సంతోషం పంచుకున్నారు. కడప, విజయవాడ, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వీరు ఒకరినొకరు పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు.



గెట్ టుగెదర్‌కు హాజరైన 1986 నర్సింగ్ బ్యాచ్‌కు చెందిన నర్సులు

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగలతో అర్చన



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రీమియర్ లీగ్ టోర్నీ విజేత స్టీల్ టైటాన్స్

ఉక్కునగరం: ఉక్కు ఎంప్లాయీస్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్‌లో స్టీల్ టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఉక్కు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో స్టీల్ వారియర్స్, స్టీల్ టైటాన్స్, స్టీల్ ఎవెంజర్స్, ఉక్కు రాయల్స్, ఉక్కు సూపర్ గ్రీన్ జట్లు పాల్గొన్నాయి. 11 రోజుల పాటు జరిగిన టీ 20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్టీల్ టైటాన్స్, ఉక్కు రాయల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్టీల్ టైటాన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్ జట్టు 19 ఓవర్లలో 143 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్ టైటాన్స్ జట్టు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి, లక్ష్యాన్ని ఛేదించింది. టైటాన్స్ జట్టుకు చెందిన బ్యాట్స్‌మన్ యు. రమేష్ 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోక్‌ఓవెన్స్ జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఏసీఎస్ విభాగం జీఎం వి. చిట్టిబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెంటార్ ఇ. వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ టైటాన్స్ జట్టుకు షీల్డు అందజేస్తున్న అతిథులు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం



వాసవీ హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



పూజలో పాల్గొన్న మహిళలు



ఆత్మాహుతి అలంకరణలో కన్యకా పరమేశ్వరి

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్య వైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము 3 గంటలకు అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక క్షీరాభిషేకం జరిపారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక ఆత్మార్పణ అలంకరణ, స్వర్ణ పుష్పార్చన, వాసవీ హోమం, మహిళలచే సామూహిక సహస్రనామ పారాయణ, ఉత్సవమూర్తికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో వాసవీమాత అగ్నిగుండంలో ఆత్మాహుతి చేసుకునే ఘట్టాన్ని స్మరించుకుంటూ 102 మంది ముత్తైదువులు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం పలువురు భక్తులకు నారాయణ సేవ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని ధర్మరక్షణకు 1014 ఏళ్ల కిందట వాసవీ మాత ఆత్మార్పణ చేసినట్లు తెలిపారు. వైశ్య జాతిని జాగృత పరిచి తనతో పాటు 102 ఆర్యవైశ్య దంపతులను అగ్నిగుండంలోకి నడిపించి శివైక్యం పొందిన రోజుగా ఆత్మార్పణ దినోత్సవాన్ని వైశ్యులు జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్, ఆత్మార్పణ దినోత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ ఎంపీ ఎస్‌టీ రామకృష్ణ, వాసవీ క్లబ్ గవర్నర్ వీవీ గుప్త, ఆర్య వైశ్య యువజన సంఘం ప్రతినిధులు నల్లూరి నూకరాజు, పూసర్ల సురేష్‌కుమార్, గ్రంధి దుర్గాప్రసాద్, విన్నకోట రామ్మూర్తి, కందుల మూర్తి, యలమర్తి గణేష్, పలు వాసవీ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు



స్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర, పరాక్రమ, ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

కొండెక్కిన చికెన్ ధర

- కిలో రూ.260



అల్లిపురం : బ్రాయిలర్ కోడి ధర కొండెక్కి కూర్చుంది. వారం రోజులుగా కోడి మాంసం ధర పెరుగుతూ పోతోంది. దీంతో మాంసాహార ప్రియులు బెంబేలెత్తిపోతున్నారు. ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహారులకు పెరిగిన ధర మింగుడు పడటం లేదు. కోళ్ల ఉత్పత్తి మందగించడంతో ఏర్పడిన కొరత దృష్ట్యా పక్షం రోజుల నుంచి కోడి మాంసం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గత జనవరి 17వ తేదీన ఫారం వద్ద రూ.95, లైవ్ బర్డ్ ధర రూ.115, స్కిన్ చికెన్ రూ.200, స్కిన్‌లెస్ చికెన్ రూ.210 పలికిన ధర రోజు రోజుకి పెరుగుతూ ఆదివారం నాటికి ఫారం రూ.117, లైవ్ బర్డ్ ధర రూ.137, స్కిన్ చికెన్ రూ.244, స్కిన్ లెస్ చికెన్ రూ.254కు చేరుకుంది. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు, బ్రాయిలర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీనివాసరావు తెలిపారు.

దిగుబడి తగ్గింది..

వాస్తవంగా వేసవి కాలంలో కోడిపిల్లలు తాపానికి చనిపోవటం, దాణా ధరలు పెరగటం, ట్రాన్స్‌పోర్టు ధరలు పెరగడంతో కోడి ధరలు పెరగడం సహజం. వేసవి ప్రభావాన్ని ముందే ఊహించిన కొంత మంది కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. కానీ ఈ ఏడాది వేసవి ప్రారంభం కాక ముందే ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఇంక వేసవి ప్రారంభమైతే పరిస్థితి ఏమిటని మాంసాహార ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ జిల్లాకు సాధారణ రోజుల్లో సుమారు 400 టన్నుల కోళ్లు అవసరమవుతాయి. ఆదివారం అయితే అది 600 టన్నుల వరకు ఉంటుందని బేగ్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. రానున్నది పెళ్లిళ్ల సీజన్ కావటంతో కోడి ధర మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వారు తెలిపారు. ప్రస్తుతం చిన్నకారు రైతులు కోళ్ల పెంపకం తగ్గించడం, అదే సమయంలో కంపెనీలు కోళ్ల ధరలను పెంచి అమ్మకాలు జరుపుతున్నాయి. దీంతో కోడి ధర పెరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి..



కోడి పిల్లల దిగుబడి లేకపోవటంతో ధరలు పెరుగుతున్నాయి. వాటికి తోడు దాణా ధరలు, ట్రాన్స్‌పోర్టు ధరలు పెరగటం కూడా ఒక కారణం. ప్రస్తుతానికి డిమాండ్‌కు తగిన విధంగా కోళ్ల ఉత్పత్తి ఉన్నా, వేసవి పెరిగే కొద్దీ పరిస్థితి మారే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కోళ్ల రైతులను ఆదుకుంటే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది.

– కొట్యాడ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా బ్యాగ్ అధ్యక్షుడు

అవగాహనతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ



డాక్టర్లతో క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు

ఎంవీపీకాలనీ: అవగాహన, ముందస్తు గుర్తింపుతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ సాధ్యమవుతుందని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ బాలల క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏటా 0 నుంచి 19 ఏళ్ల వయసు గల 4 లక్షల మంది చిన్నారులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. పిల్లల్లో క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ అత్యంత కీలకమన్నారు. ముందస్తు నిర్ధారణతో వారికి ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన పెంచే దిశగా మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ బాలిస్టాలిన్ చౌదరి, డాక్టర్ వి.ప్రవీణ, డాక్టర్ వై.రజనీ, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.